క్లుప్తంగా

సేవారత్నకు అభినందన

నడింపాలెం (ప్రత్తిపాడు): ప్రభుత్వానిక ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులు అని నడింపాలెం సర్పంచ్ లాం రత్నకుమార్ అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని కార్యదర్శి ఖాజా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సేవారత్నగా ఎంపికైన చావలి గంగాధర్‌తో పాటు సేవామిత్రలుగా ఎంపికైన 25 మంది వలంటీర్లను దుశ్శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. సర్పంచ్ రత్నకుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందించడం నుంచి, అన్నిరకాల ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ ఆళ్ల వీరాస్వామి, ఉపసర్పంచ్ పాలెపు కుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవితం



గుంటూరు రూరల్: పచ్చదనం పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన జీవితం ఏర్పడుతుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఏఎన్‌యూ, కళాశాల సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పచ్చదనం పరిశుభ్రతపై జొన్నలగడ్డ గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక అవసరాలైన గాలి, భూమి పరిశుభ్రంగా ఉంచినట్లయితే మంచి ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామంలోని వీధుల్లో తిరిగి ప్రజలకు మొక్కలు పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు ఐదయ్య, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కేఎస్ రజనీకాంత్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఎంపీడీఓగా స్వరూపరాణి బాధ్యతలు స్వీకరణ



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎంపీడీఓగా స్వరూపరాణి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఈ నెల ఒకటో తేదీన ప్రత్తిపాడు ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న ఎ. శ్రీరమ్యను ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ చేయడంతో ఆమె స్థానంలో దుర్గాప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. అయితే అనూహ్యంగా దుర్గాప్రసాద్‌ను నిజాంపట్నంకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో అమర్తలూరులో ఎంపీడీఓగా పనిచేస్తున్న స్వరూపరాణిని ప్రత్తిపాడుకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో బాధ్యతలు చేపట్టిన ఆమె విధుల్లో చేరారు.

కొల్లిపర మార్కెట్ యార్డు నిర్మాణానికి మార్గం సుగమం

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్: కొల్లిపరలో నిర్మించనున్న మార్కెట్ యార్డు నిర్మాణానికి మార్గం సుగమం అయిందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో రైతులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, తెనాలి మార్కెట్ యార్డులో నిర్వహించిన వైఎస్సార్ రైతు భరోసా కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ఆ సందర్భంలో కొల్లిపర రైతులు తమకు తమ ప్రాంతంలో ఒక మినీ మార్కెట్ యార్డు నిర్మించాలని ముఖ్యమంత్రిని కోరారన్నారు. అప్పుడు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఆ ప్రాంతంలో భూమి ఉన్న రైతులతో మాట్లాడి 4.21 ఎకరాలకు అగ్రిమెంట్ అయిందన్నారు. త్వరలోనే దీనిని రిజిస్ట్రేషన్ చేయించి మార్కెట్ యార్డు నిర్మాణం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జేసి రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, మార్కెటింగ్ ఏడీ రాజబాబు, కలెక్టరేట్ ఏఓ జానకి పాల్గొన్నారు.

దళిత, ప్రజాసంఘాల ర్యాలీ

నెహ్రూనగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని భారత కరెన్సీపై ముద్రించాలనే ప్రధాన డిమాండ్‌తో మంగళవారం దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికి చేరువ చేయాలని అప్పుడే అంబేడ్కర్‌కు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటులో అనవసర రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. అంబేడ్కర్ ఆశయ సాధన సమితి జాతీయ అధ్యక్షులు కాల్వ రవి మాట్లాడుతూ ఈ డిమాండ్ సాధనకై గత 13 ఏళ్లుగా పోరాటం సాగిస్తున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు అంబేడ్కర్ చిత్రపటాన్ని భారత కరెన్సీ ముద్రించాలని తమ మ్యానిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. సంఘ గౌరవ అధ్యక్షులు రంజిత్ ఓఫీర్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అభ్యంతరాలపై సమగ్ర పరిశీలన

- 'ఇంటి వద్ద నుంచే ఓటు' విధానంపై విస్తృత ప్రచారం
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్

ప్రత్తిపాడు: మూడు కేటగిరీల ఓటర్లు తమ ఓటు హక్కును ఇంటి వద్ద నుంచే వినియోగించుకునేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని గుంటూరు ఆర్డీఓ పి. శ్రీకర్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ శ్రీకర్ రాజకీయ పార్టీల నాయకులతో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎనభై సంవత్సరాల పైబడిన వారు, పూర్తిగా దివ్యాంగులైన వారు, కోవిడ్‌తో బాధపడుతున్న వారు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం-12 డిని దరఖాస్తు చేసుకోవాలన్నారు. జెన్యూనిటీని పరిశీలించిన తరువాతే అలాంటి వారికి అనుమతి ఇచ్చి ప్రత్యేక బృందం ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఓటుకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ముసాయిదా జాబితా ప్రచురణ తరువాత వచ్చిన ప్రతి ఒక్క అర్జీని క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుదని, ఒకటికి రెండు సార్లు విచారించిన తరువాతనే అర్జీలను క్లోజ్ చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల సిబ్బందిని, సామగ్రిని తరలించే మార్గంలో అవాంతరాలున్న రూట్‌ను గుర్తించి, రూట్‌ను మార్చేందుకు ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్‌కు పంపించామని ఆర్డీఓ వివరించారు. ఇప్పటికే ఈవీఎంలు జిల్లాకు చేరుకున్నాయని, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత ర్యాండమ్‌గా నియోజకవర్గానికి కేటాయిస్తారన్నారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరు వంటి వాటిపై ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తి చేశామని, పనితీరును ఆయా రాజకీయ పార్టీల నేతల సమక్షంలో పరిశీలించామని చెప్పారు. గత ఎన్నికల్లో ఎదురైన అనుభవాల దృష్ట్యా పోలింగ్ రోజుల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 20 శాతం ఈవీఎంలు, ముప్పై శాతం వీవీప్యాట్‌లను అదనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది అన్ని నూతన ఈవీఎంలు కావడం వలన అలాంటి సమస్యలు ఉత్పన్నం కావడానికి 99 శాతం ఆస్కారం లేదన్నారు.

ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంను వినియోగించుకోండి..

రాజకీయ నాయకులు, ఓటర్లు ఏమైనా ఫిర్యాదులు చేయాలన్నా.. దరఖాస్తులు చేయాలన్నా ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలను వినియోగించుకోవాలని ఆర్డీఓ నాయకులకు సూచించారు. ఎన్నికల ర్యాలీల అనుమతులు, ఇతరత్రా అవసరాలకు ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ యాప్‌లు, వెబ్ పోర్టల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తద్వారా అధికారులు త్వరితగతిన స్పందించడానికి ఆస్కారం ఉంటుందని, అంతేకాకుండా జవాబుదారీతనం కూడా అధికంగా ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు, డీటీలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఎంఈఓ డి.బలిరాం, సయ్యద్ సుభాని

పెదకాకాని: విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి డి.బలిరాం అన్నారు. మండలంలోని నంబూరు ఉర్దూ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు భోజనం ప్లేట్లు, గ్లాసులు ఉపాధ్యాయులకు వారి కోరిక మేరకు జాతీయ నాయకుల చిత్రపటాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఈఓ డి.బలిరాం మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల కమిటీలు, గ్రామపెద్దలు భాగస్వాములు కావాలన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని మాట్లాడుతూ ప్రభుత్వం మన బడి నాడు నేడు పథకం ద్వారా రూ.20 లక్షలతో పాఠశాలను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయులు సయ్యద్ షహజాది, సీఆర్పీ ప్రసన్న, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ ఇస్మాయిల్, ఎండీ బుర్హానుద్దీన్, పేరంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరులు అరెస్టు

ప్రత్తిపాడు: కోతముక్కాట ఆడుతున్న ముగ్గురు జూదరులను ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. గ్రామశివారులో రహస్యంగా కోతముక్కాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న ఎస్ఐ వి.సోమేశ్వరరావు సిబ్బందితో కలిసి జూదస్థావరంపై దాడి చేసి కోతముక్కాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోనికి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 4,060లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంధన పొదుపు తప్పనిసరి

నెహ్రూనగర్: మున్సిపాలిటీలలో ఇంధన పొదుపు అవసరం తప్పనిసరి అని నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) జె.శ్రీనివాస్ తెలిపారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) ఆధ్వర్యంలో మంగళవారం అరండల్ పేటలోని ఓ హోటల్‌లో నగరపాలక సంస్థ ఇంజినీర్లకు, ఎమినిటి కార్యదర్శులకు ఇందన పొదుపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో విద్యుత్ బిల్లులను తగ్గించడానికి ఇంధన ఆదా, శక్తిని ఆదా చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీధి దీపాలు, మున్సిపల్ భవనాలు, ఇతర పలు అంశాల్లో ఇంధన శక్తి పొదుపుకు అవకాశం ఉందన్నారు. ఏపీఎస్ఈసీఎం డీఈఈ జి.శ్రీనివాసులు మాట్లాడుతూ మునిసిపాలిటీల్లో డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్ కింద లోడ్ తగ్గించేందుకు ఇంధన సామర్థ్య పెంపు అమలు చేసేందుకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఈఈలు కొండా రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మార్కెట్లు, మరుగుదొడ్ల నిర్వహణ హక్కుల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న డెప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణయ్య

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన మార్కెట్లు, మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌ల నిర్వహణకు సంబంధించి ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు హక్కుల కోసం ట్రావెలర్స్ బంగ్లాలో సీల్డ్ టెండర్, బహిరంగ వేలాన్ని నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య మంగళవారం నిర్వహించారు. అయన మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన 19 ప్రాంతాల్లోని మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌లు, మార్కెట్లకు సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించగా 13 ప్రాంతాల్లో టెండర్ దార్లు పాల్గొని టెండర్ దాఖలు చేశారని, మరో 6 ప్రాంతాల్లో టెండర్ దాఖలు చేయలేదన్నారు. టెండర్‌ల్లో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ కొల్లి శారద మార్కెట్‌లో ఆశీలు రుసుం వసూలుకు అత్యధికంగా రూ.65,00,999, గాంధీపార్క్ మరుగుదొడ్ల వద్ద రుసుం వసూళ్లకు అత్యధికంగా రూ.32,85,000కు టెండర్ దార్లు బిడ్‌లు దాఖలు చేశారని తెలిపారు. తదుపరి కమిషనర్ అనుమతి, స్థాయి సంఘం ఆమోదం మేరకు తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. కొల్లి శారద హోల్ సేల్ కూరగాయల మార్కెట్‌లో ఆశీలు, గాంధీ పార్క్ మరుగుదొడ్లకు, విజ్ఞాన మందిరం రోడ్డులోని మరుగుదొడ్లు, వెస్ లాక్ మార్కెట్ సెల్లార్‌లోని సైకిల్ స్టాండ్, పాల ఆసుపత్రి వద్ద కూరగాయల మార్కెట్‌లో రుసుం వసూళ్లు, పచ్చగడ్డి మార్కెట్, అరండల్ పేట మెయిన్ రోడ్ తహసీల్దార్ కార్యాలయం వద్ద మరుగుదొడ్లు, నాజ్ సెంటర్ వద్ద మరుగుదొడ్లు, గాంధీ పార్క్‌లో క్యాంటీన్, బండ్ల బజార్ మరుగుదొడ్లు, కృష్ణా పిక్చర్ ప్యాలెస్ వద్ద మరుగుదొడ్లు, ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద మరుగుదొడ్లు, డాక్టర్ కొల్లి శారద కూరగాయల మార్కెట్ మరుగుదొడ్ల నిర్వహణకు టెండర్ దార్లు పాల్గొన్నారని తెలిపారు. పాల ఆస్పత్రి దగ్గర మరుగుదొడ్లకు, నగరంలోని 6 ప్రాంతాల్లో ఉన్న నమ్మా టాయ్ లెట్స్, గాంధీ పార్క్ లోపల పార్కింగ్, సంద్రీస్ మార్కెట్, రంజాన్ పండుగ సమయంలో రెడ్ ట్యాంక్ స్థలం తాత్కాలిక ఆక్రమణ ఫీజు రెండు ప్రాంతాల్లో టెండర్‌లో ఎవ్వరూ పాల్గొనలేదని, కమిషనర్ ఉత్తర్వులు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సాంబశివరావు, బాలాజీబాష, రెహ్మాన్, రెవెన్యూ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటరామయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ఇళ్ల ముంగిటకే వైద్యసేవలు

ఫిరంగిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకే వైద్య సేవ లు ప్రభుత్వం అందజేస్తున్నట్లు వైద్యురాలు ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. 363 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు అందజేశారు. శిబిరంలో వైద్యులు శ్వేత, హసిత, దివ్య, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్ వీ అన్నామేరీ, ఎంపీహెచ్ఎస్ కె.సుదర్శన్‌రాజు, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎన్ఎం ఆనందకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవకాశాలను సృష్టించుకుని ఎదగాలి

పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న పొగాకుబోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు అవకాశాలను సృష్టించుకుని ఎదగాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో మంగళవారం ఎంబీఏ- ఎంసీఏ విభాగ ఆధ్వర్యంలో ఏఎన్‌యూ అంతర్ కళాశాలల విద్యార్థులకు క్విజ్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ కాంటెస్ట్, షేర్ మార్కెట్ ట్రేడింగ్ గేమ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విద్యావంతులైన యువతరం ఎంచుకున్న రంగంలో అవకాశాలను అందిపుచ్చుకుని గమ్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని సూచించారు. సాధారణ స్థితి నుంచి అసాధారణ స్థితికి చేర్చే ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటూ, అందరి ఆలోచనలకు భిన్నంగా ఎప్పుడైతే ఆలోచిస్తామో అప్పుడే మనం విజయానికి మార్గం వేసినట్లేనని చెప్పారు. ఎటువంటి వారికైనా సమయం ఒకటేనని ఆ సమయాన్ని ఎలా వినియోగించుకోవాలో తెలిస్తే, జీవితంలో గెలిచినట్లేనని అన్నారు. ముఖ్యంగా యువత ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల మాయలో పడి జీవితాలను విషపూరితం చేసుకోకుండా సాంకేతికతను మన అభివృద్ధికి ఉపయోగించుకుని జీవితాలను బంగారు మయం చేసుకోవాలని హితవు పలికారు. ఈసందర్భంగా కంప్యూటర్ ప్రోగ్రామింగ్ కాంటెస్ట్ పోటీల్లో హిందూ కళాశాల ప్రథమ స్థానంలో నిలువగా, తరువాతి రెండు స్థానాల్లో టీజేపీఎస్ కళాశాల నిలిచింది. బిజినెస్ క్విజ్‌లో టీజేపీఎస్ కళాశాల ప్రథమ స్థానం, హిందూ కళాశాల ద్వితీయ, తృతీయ స్థానాలు, షేర్ మార్కెట్ ట్రేడింగ్ గేమ్ పోటీల్లో ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల, ప్రథమ స్థానం, హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి.

బ్యాంక్‌లోన్ ఇప్పిస్తానంటూ మోసం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం రోడ్‌లో ఓ చికెన్ షాప్ యజమానికి లోన్ ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి మోసం చేసి ఆయన ఖాతాలో డబ్బులను మాయం చేసి పరారైన ఘటన వెలుగు చూసింది. మంగళవారం చికెన్ షాప్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి పోలీసులు తాడేపల్లి పోలీసులను అప్రమత్తం చేయడంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సేకరించిన వివరాల ప్రకారం తాడేపల్లి పోలకంపాడుకు చెందిన శ్రీనివాసరావు అనే చికెన్ వ్యాపారి మంగళగిరి యర్రబాలెం రోడ్‌లో చికెన్ షాపు నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన పేరు సాయి సందీప్‌గా తాను బ్యాంకులో పనిచేస్తున్నానని పర్సనల్ లోన్ ఇప్పిస్తానని చెప్పి శ్రీనివాసరావును నమ్మించాడు. శ్రీనివాసరావును మాటల్లో పెట్టి తన వద్ద ఉన్న ఆండ్రాయిడ్ ఫోన్ తీసుకుని శ్రీనివాసరావు అకౌంట్‌లో ఉన్న రూ.15 వేల నగదును ఫోన్‌పే ద్వారా కృష్ణాజిల్లా పోరంకికి చెందిన మొక్కపాటి నాగ ఫణీంద్రకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనంతరం అక్కడి నుంచి సాయి సందీప్ బండిపై ఉడాయించాడు. ఖాతా నుంచి ఫోన్‌పే ద్వారా రూ.15 వేలు వేరే ఫోన్ నెంబర్‌కు బదిలీ అయిన విషయం గమనించిన శ్రీనివాసరావు పోలీసులను ఆశ్రయించగా శ్రీనివాసరావు ఫోన్ నుంచి నగదు బదిలీ చేసిన నెంబర్‌ను సంప్రదించారు. తన పేరు నాగ ఫణీంద్ర అని, ఫణీంద్ర ఫోన్ పేకు సాయి సందీప్ డబ్బులు పంపాడని, తిరిగి సాయి సందీప్‌కు డబ్బులు చెల్లించానని తెలపడంతో ఫణీంద్ర ఇచ్చిన సమాచారం మేరకు తాడేపల్లి పోలీసులను అప్రమత్తం చేశారు. ద్విచక్రవాహనంపై వెళుతున్న సాయి సందీప్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుడి వద్ద నుంచి మరింత సమాచారం సేకరిస్తున్నట్లు సీఐ మధుసూదనరావు తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి దురాగతాలు

ఇంటి ముందు పార్క్ చేసిన వాహనాలకు నిప్పు పెట్టి పరారు



తగలబడిన ద్విచక్ర వాహనాలు, సైకిల్

తాడేపల్లిరూరల్ : మద్యం మత్తులో ఓ యువకుడు మంగళవారం తెల్లవారు జామున రోడ్డు వెంబడి పార్క్ చేసి ఉన్న కారుతో పాటు రెండు ద్విచక్రవాహనాలకు నిప్పు పెట్టడంతో కారు పాక్షికంగా కాలగా, రెండు ద్విచక్రవాహనాలు, సైకిల్ పూర్తిగా దగ్ధమయ్యాయి. జరిగిన ఈ సంఘటనపై బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆ ప్రాంతంలో విచారణ చేపట్టి వాహనాలను దగ్ధం చేసిన వ్యక్తి తలగాల దుర్గాప్రసాద్‌గా గుర్తించారు. సీఐ మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం సీతానగరం ఆయుర్వేద వైద్యశాల వద్ద నివాసముంటున్న లోలాకుల నవీన్‌కుమార్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా, పెద్దపెరిగె వెంకటేశ్వర్లు ఇస్త్రీ బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరూ రాత్రి సమయంలో 10 గంటల తర్వాత తమ నివాసాల ముందు ద్విచక్రవాహనాలను పార్క్ చేసుకున్నారు. వెంకటేశ్వర్లు ఇంటిముందు సైకిల్ కూడా పార్క్ చేసి ఉంది. ఆ పక్క బజారులో నివసించే కుంబా రమేష్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తన కారును ఇంటి ముందు పార్క్ చేసుకున్నాడు. తెల్లవారు జామున రెండు గంటల సమయంలో అదే ప్రాంతంలో నివసించే తలగాల దుర్గాప్రసాద్ మొదట రెండు ద్విచక్రవాహనాలకు నిప్పు పెట్టగా పక్కనే ఉన్న సైకిల్ కూడా కాలిపోయింది. ఆ రెండు వాహనాలు తగలబెట్టిన అనంతరం పక్క వీధిలో కుంబా రమేష్ కార్ పార్క్‌చేసి ఉండగా కారుమీద సిగరెట్ పడవేశాడు. మద్యం అలవాటు ఉన్న దుర్గాప్రసాద్‌కు నరాల బలహీత ఉండడంతో మందులు వాడుతున్నాడని, మద్యం, మందుల మత్తులో ఇలా ప్రవర్తించాడని వారి కుటుంబ సభ్యులు తెలిపారని చెప్పారు. ప్రస్తుతం దుర్గాప్రసాద్ ఇంటివద్ద లేదని జరిగిన సంఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సీఎం జగన్ ఆదర్శంగా 'సంక్షేమ సంగమం'

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- పెదకాకాని మండలంలో ఇటీవల గుండెకు స్టంట్లు, సర్జరీలు చేయించుకున్న వారికి పరామర్శ
- కృతజ్ఞతలు తెలిపిన రోగులు

పెదకాకాని: రాష్ట్రంలోని ఏ ఒక్క పేదవాడు వైద్యం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి రాకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి 25 లక్షల వరకూ పెంచారని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం ద్వారా నిర్వహించిన క్యాంపు ద్వారా ఉచితంగా గుండెకు స్టంట్లు వేసే కార్యక్రమం చేపట్టామన్నారు. పెదకాకాని గ్రామంలో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమంలో మీ గుండె పదిలం ద్వారా విజయవాడ మెడ్‌స్టార్ ఆసుపత్రిలో స్టంట్‌లు వేయించుకున్న, సర్జరీ చేయించుకున్న సంకూరి కుమారి, కుక్కల చిన వెంకటేశ్వర్లు, ఎస్‌కే అమీర్‌బాషాలను మంగళవారం స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి వ్యక్తిగతంగా కలసి పరామర్శించారు. చికిత్స చేయించుకుని కోలుకుంటున్న వారికి పండ్లు అందజేశారు. గ్రామంలో బజరంగ్ నేత్ర జ్యోతిలో భాగంగా కళ్లజోళ్లు తీసుకున్న గ్రామస్తులు, మహిళలు అంబటి మురళీకృష్ణను కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం ద్వారా ఉచితంగా నేత్రజ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ఫిజియోథెరపీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పెదకాకానిలో సర్జరీ చేయించుకున్న వారిని పరామర్శిస్తున్న అంబటి మురళీకృష్ణ

పేదల ఆరోగ్యానికి భరోసా

పొన్నూరు: పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బొద్దులూరి రంగారావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణం నిడుబ్రోలులోని డీఆర్‌కే కాలనీలో రెండో విడత వైఎస్సార్ ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలపై వచ్చిన ప్రజలకు వైద్య సిబ్బంది పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రంగారావు మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లెల రాజు, జంపనాటి శ్రీధర్, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు ఎంపికైన సబ్ జూనియర్ జిల్లా జట్టు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన చిన్నారులు

గుంటూరు వెస్ట్(క్రీడలు): జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎస్వీఎన్ కాలనీలో సబ్ జూనియర్ బాల బాలికల జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొసనా వేణుగోపాల్ మాట్లాడుతూ వచ్చే నెల ఒకటి నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే జట్టును ఎంపిక చేశామన్నారు. పోటీలను ఎస్వీఎన్ పార్క్ అధ్యక్షులు పార్థసారథి ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో వాకా పార్థసారథి, మున్నంగి రాజేశ్వరరావు, పాటిబండ్ల సాంబశివరావు, కురందేశ్వరరావు, సరళ పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు ఎంపికైన బాలికలు: టి.హేమలక్ష్మి, ఆర్.కీర్తి, పి.మానస, కె.జీవిత, కె.లాస్య, ఎం.ఆకాష, **బాలురు:** జె.శశాంక్, ఐ.కార్తీక్, బంటు గావెల్.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ఫిరంగిపురం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని మేరికపూడి, పొనుగుపాడు గ్రామాల్లో ఓటు హక్కు వినియోగం, ఈవీఎంల గురించి ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన నియోజకవర్గ నోడల్ అధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటు హక్కు వినియోగం, ఈవీఎంలు పనిచేసే విధానం, వీవీప్యాడ్స్ గురించి వివరించినట్లు తెలిపారు.